# పాడుపడిన గుడి

శ్రీ యస్. వి. సత్యనారాయణమూర్తి

"ఫజల్! ఇది నిజమేనా?"

"ఏది అబ్బాజాన్?"

"నువ్వు హిందూ శిల్పాలను చెక్కడం....?"

"జీ...."

"ఫజల్! ఇదేం బాగోలేదు. నిప్పచ్చరంలాటి మన వంశ ప్రతిష్టకు నీ చెడు ప్రవర్తనతో కళంకం ఆపాదిస్తున్నావు. నీవు యీనాటినుండి ఆ మాయాచారి యింటికిపోవడం మానివేయాలి"

"అబ్బా జాన్! కళకు మతమేమిటి? సౌందర్యాన్ని ఆరాధించడం ప్రతి మనిషికీ ఆనందదాయకమే. అందుకు తప్పుడు వ్యాఖ్యానంచేసి నన్ని బంగారు పంజరంలో బంధించి వుంచడమే తమ ఆశయమైతే అది వ్యర్థంకాక తప్పదని చెప్పడానికి విచారిస్తున్నాను."

"ఫజల్! నీవేం వాగుతున్నావో నీకే విచక్షణ లేకుండా వుంది ఈ సుబేదార్ మంగల్‌ఖాన్ వారసుడివిగా చెడబుట్టావు నీవు. నీవు నా కొడుకువని చెప్పుకొనడానికే నాకు సుల్తానువారి దర్బారులో తలవంపులుగా వుంది. ప్రతి గులాంగాడూ నీ విషయమై వ్యంగ్యంగా ఎత్తిపొడిచి, నన్ను వేలెత్తి చూపిస్తున్నారు. ఒకప్పుడు వారు నా ముందు తలెత్తి చూడడానికికూడా సాహసించని పిరికిపందలు. నీకేం తెలుసు యిదంతా? తిన్నంత తిని, కళలంటూ ఊరిమీద ఊరేగుతుంటావు నీ కంత కళాప్రియత్వమే ఉంటే అదేదో నీభవనంలోనే సాధన చేసుకొనరాదా?"

"అబ్బా జాన్! కళ మన భవనానికి ఆజ్ఞాపిస్తే వచ్చిపడే వస్తువుకాదు. వస్తుతః దానికి కొన్ని పరిమితులున్నాయి. విలాసాలతో తులతూగే రాజసౌధంలో కూర్చుంటే అలవడేది లాలాసగానీ కళకాదు ఆ కళ చెమటోడ్చి శిల్పాలుచెక్కే సామాన్య శిల్పి చేతిలో చిందులేస్తుంది. రాతికి రూపం యిచ్చి, జీవంపోసి చిరకాలంగా నిలిపే ఆ అద్భుత కళాసృష్టి రహస్యం మన రాజభవనాల్లోలేదు. నిరంతరకాలం శ్రమించి గురు శుశ్రూష దశాబ్దాలుచేసి, రాత్రింబగళ్లు నిద్రాహారాలు మరచి సాధనచేసిన మహా శిల్పాచార్యుల చేతిలో వుంది. అందుకని నేను దానికోసం వారి వద్దకు పోవడం తప్పదు. వారు మన దగ్గరకురారు. కొండ మహమ్మదు దగ్గరకు రాకపోతే మహమ్మదే కొండదగ్గరకు పోతాడు."

ప్రచురణకు స్వీకరించిన

పోటీ కథానిక

"ఫజల్! వీల్లేదు. ఇంక యీ కళారాధన చాలు. కొద్ది కాలంలో నా సుబేదారు పదవీభారం నీ కప్పగించి నిశ్చింతగా విశ్రాంతి తీసుకోవాలను కుంటున్నాను. నాకూ వృద్ధాప్యం వచ్చింది నీ విలా కళలని వెర్రివేషాలువేస్తే ప్రజలు నిన్ను పట్టి వెంగళాయి క్రింద కట్టేస్తారనడానికి అనుమానంలేదు. నీవీనాటి నుండీ కోట విడచి బయటకు పోవడానికి వీల్లేదు. కాస్సేపట్లో కొన్ని ముఖ్యమైన వ్యవహారాలు నీ వదకు పంపుతాను వాటిని మంచిగా పరిష్కరిస్తే చాలా సంతోషం, నాకు తగిన కొడుకువనిపించుకో. అది చాలు. వస్తాను."

మంగల్‌ఖాన్ రోజుకుంటూ చరచరా తన అంతఃపురానికి వెళ్ళిపోయాడు

ఫజల్ ఉస్సురుమంటూ నిట్టూర్పు విడిచాడు పాదరక్షలు ధరించి, ఉలి, సుత్తి ఉన్న దంతపు పేటికను తీసుకొని శయ్యామందిరంలో నుండి ఆలోచనాగారంలోకి అడుగుపెట్టాడు. జరీపోగుల లతలు కుట్టబడిన ఎర్రని కాశ్మీరు తివాసిపై మెత్తని అడుగులువేస్తూ సంశయిస్తూ ముందుకు సాగాడు.

ఫజల్ ద్వారం దాటబోగానే ప్రధాన అంగరక్షకుడు సగౌరవంగా వారించాడు.

ఫజల్ భ్రుకుటి విరచి "ఏమిటీ సాహసం?" అని గర్జించాడు.

ప్రధాన అంగరక్షకుడు అహమద్‌షేర్ సవినయంగావంగి సలాంచేస్తూ "క్షమించాలి తమను బయటకు విడువరాదని సుబేదార్‌సాబ్ ఫర్మానా యిచ్చారు. అందువలన యీ సేవకుడికి తమని ఆటంకపరచక తప్పిందికాదు. అనుజ్ఞలేనిదే విడచిపుచ్చే వీఁలేదు." అన్నాడు.

ఫజల్ గిర్రున వెనుదిరిగి దంతపు పేటికను నేలకేసి కొట్టి, పాదరక్షలు గిరవాటేసి అక్కడున్న ఆసనంపై కూలబడ్డాడు. దంతపు పేటిక ముక్కలు చెక్కలై చెల్లాచెదురై పోయింది. సుత్తి శానం నేలమీదపడి ఖంగుమన్నాయి. ఫజల్ తన సమున్నత శరీరాన్ని కుదించుకొని, ముఖం చేతుల్తో కప్పుకున్నాడు.

కాసేపు తళతళ మెరుస్తున్న పాలరాతి నేలలో తన ప్రతిబింబంవంక సాలోచనగా చూసాడు. అక్కడే వున్న బంగారు పంజరంలో రామచిలుక రెక్కలు టపటపా విదిలిస్తూ "ఫజల్.... ఫజల్...." అని అరిచింది.

ఫజల్ దిగాలుగా నవ్వి "నీలాగే నను ఒక బంగరు పంజరంలో బందీని రామ్!" అన్నాడు. పాలరాతిలో ప్రతిబింబాలను చూస్తున్న అతనికి మాయాచారి చెప్పిన శిల్పశాస్త్ర సూత్రాలు జ్ఞాపకం రాసాగాయి ఫజల్ విసుగుతో కాసేపు అటూ ఇటూ పచార్లు చేసాడు. చివరికి సుత్తి, శానం తీసుకొని ఒక నున్నని పాలరాతి పలకమీద

అనవాలుగా కొన్ని గీతలు గీచి పని ప్రారంభించాడు.

టంగ్ టంగ్ మనే పదునైన ఉలి దెబ్బలతో పాలరాతి పెచ్చులు మెత్తగా పోతున్నాయి. అతనిలో కోపం అపూర్వమైన ఆవేశంగామారి శిల్పంలో రూపుదాలుస్తోంది. చకచక చెక్కుతున్నాడు. విగ్రహం అంతకంతకూ స్పష్టమవుతూంది. స్వచ్ఛమైన పాలరాతి మీద కోదండరాముని విగ్రహం వెలుస్తోంది.

ఫజల్ తదేక ధ్యానంతో చెక్కుతున్నాడు. పొద్దుపోయి మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఫజల్ తన పని యింకా ముగించలేదు. దీపాలు వెలిగింప జేయడానికి యిద్దరు పరిచారకులను వెంట బెట్టుకు వచ్చిన అహమద్ షేర్ దిగ్భ్రాంతుడై ఫజల్ చెక్కిన శిల్పం వంక చూసాడు. కోదండరాముడు సజీవ మూర్తియై సందర్శన మిస్తున్నాడా సుందర శిల్పం. కాసేపు షేర్‌కు నోటమాట రాలేదు. చివరకు "హిందూదైన విగ్రహమా?!.... సుబేదార్ సాబ్ చూస్తే....?" అన్నాడు నివ్వెరపోతూ.

ఫజల్ ఉలిక్కిపడిలేచాడు.

"అరే! అప్పుడే పొద్దుపోయిందా? నాకు తెలియనేలేదు." అంటూ సుత్తినీ, శానాన్నీ క్రిందబెట్టి లేచాడు. తను చెక్కిన శిల్పాన్ని దీపాల వెలుతురులో చూసి, తన మెళకువకి తనే ఆశ్చర్యపడ్డాడు.

షేర్ "ఫజల్‌జీ! ఇది మీ నాయనగారు చూసారంటే మండిపడతారు. అసలే వారికీనాడు చాలా కోపంగా వుంది. దయచేసి యీ విగ్రహాన్ని చాటుగా ఉండనివ్వండి." అంటూ ఆ శిల్పంపైన తివాసీ కప్పివేయడానికి ప్రయత్నించాడు.

ఇంతలో షేర్ చేతిని ఎవరో వెనక్కిలాగారు. షేర్ వెనుదిరిగాడు. ఎప్పుడు వచ్చాడోగానీ మంగల్‌ఖాన్ కళ్ళంట నిప్పులు కురుస్తున్నాడు.

"షేర్! ఒకరు చేసిన తప్పును కప్పిపుచ్చడం రెండింతల నేరం. నువ్వూ ఫజల్‌కి మద్దతు దారునిగా మారుతున్నావా? శిల్పం చెక్కడానికున్న ధైర్యం ప్రదర్శించడానికీ ఉండాలి. నీవు ఫజల్‌ని నా కోపం బారినుండి కాపాడాలని అనుకోనేది వట్టి భ్రమ. ఫజల్‌కు నేనంటే లెక్కలేదు."

"జీ హుజూర్!" అన్నాడు తడుముకుంటూ షేర్. ఫజల్ తలవాల్చి నిలబడ్డాడు. అతనికి తండ్రి ఆగ్రహం పట్టనేలేదు. తన శిల్పం వంకే పరిశీలనా దృష్టితో చూస్తూ, దాని అందాన్ని తూస్తున్నాడు.

"అద్భుతంగా వుంది. ఎటొచ్చీ యిది కాఫిర్ శిల్పం, మన భవనంలో నిలువరాదు. ఎవరైనా చూస్తే ఎంత నగుబాటు. వెంటనే దీన్ని తీసివేయించి, వేరొక ఫలకాన్ని వేయిస్తాను." అన్నాడు ఖాన్. అంతదాకా నిశ్శబ్దంగావున్న ఫజల్ చటుక్కున "వీల్లేదు" అన్నాడు.

"వీల్లేదా? ఫజల్! నీకు మతిపోతూంది నేనూ వీల్లేదనే అంటున్నాను నీవు మన మత విశ్వాసాలకీ, ఆచారాలకీ వ్యతిరిక్తంగా నడుస్తున్నావు. మనకి విగ్రహారాధన నిషిద్ధం, భగవంతుని రూపాన్ని విగ్రహంలో కల్పించడమూ తప్పే. అది అపచారమని ఖురాను ఆదేశిస్తోంది."

"నేను విగ్రహాన్ని చెక్కినది మత దృష్టితో కాదు అబ్బా జాన్! కళాదృష్టితో బాగా చూడండి ఆ విగ్రహంలో ఎంత సౌందర్య, లాలిత్యాలు ఉట్టిపడుతున్నాయో ఆ శిల్పాన్ని చూస్తుంటే మీకు ఆకర్షణీయంగా అనిపిస్తుందా, లేదా? మనస్సుకి ఉత్తమ ఆనందం కలిగించే పవిత్ర వస్తువు ఏదైనా సరే మతానికి అతీతమైనది అక్బరు చక్రవర్తి ఏం చెప్పాడంటే...."

"ఏం చెప్పాడో నాకూ తెలుసు. వారు చక్రవర్తులు గనుక ఏం చెప్పినా, ఏమి చేసినా చెల్లింది. నా దృష్టిలో అది కేవలం ఒక రాజకీయపు ఎత్తు మాత్రమే. అక్బరు సుస్థిర సామ్రాజ్య పాలనకి తోడ్పడిన అపూర్వమైన ఉపాయం అది."

"కావచ్చు. ఒప్పుకుంటాను. అదీ ఒక విధంగా మంచి మార్గమేగా. ఆ చక్రవర్తి కాలంలో చక్కటి పరిపాలన సాగిందని మీరే ఒప్పుకుంటున్నారు. అదే మార్గాన్ని మనమూ పోయి సహనదృష్టితో సుస్థిర శాంతి పాలన చేయవచ్చు మంచి పని చేయడానికి సామాన్యులూ, చక్రవర్తులూ అనే తేడా అనవసరం కదా."

"చాల్చాలు. కట్టిపెట్టే వితండవాదం చదవేస్తే ఉన్నమతి కాస్తా ఊడి చక్కాపోయిందట నీకు షేక్ మౌలా నేర్పిన రాజకీయ పరిజ్ఞానం, శాస్త్ర విద్యా యిట్లా తయారైందా?"

మంగల్‌ఖాన్ ఒరలో ఖడ్గం చప్పున దూసి పాలరాతి పలకలను పెకలించడానికి పూనుకున్నాడు. అతని కత్తికి అనుకోని విధంగా ఫజల్ కత్తి అడ్డు పడింది. షేర్ తెల్లముఖంవేసి తండ్రీ, కొడుకుల్లో ఎవరి పక్షాని మాట్లాడ్డానికి పాలుపోక నిలబడ్డాడు. కలిసిన కత్తులు రెండూ ఖంగుమన్నాయి.

మంగల్‌ఖాన్ మండిపోయాడు. అతడు ఎదురులేని కత్తియుద్ధపు జోదుగా పేర్గాంచాడు కదనరంగంలో పదునెక్కిన కత్తి పట్టి వేటుకు రెండు తలలచొప్పున దుళ్లగొట్టేవాడు మంగల్‌ఖాన్ కత్తి మృత్యుదేవత నాలికకి మారుపేరు. కత్తియుద్ధంలో అతడికి సరితూగేవారు చుట్టు ప్రక్కలలో మచ్చుకికూడాలేరు. నేర్పుకితోడు అతనిది సుదార్ఢ్య శరీరం. వేటలో తిరగబడిన సింహంతో బాహాబాహీ పెనగి చంపివేసిన మహాసత్వం అతనిలో కేంద్రీకృతమై వుంది. జవముడిగినా సత్వం కొరవడలేదు అహంకారమూ హెచ్చే! ఇంత కాలానికి తన బలాన్ని మరొకరు సవాలుచేయడం సహించలేక పోయాడు. సవాలు చేసినవాడు ఎవడైనాసరే జితోస్మి అనిపించాలనేదే అతడి పట్టుదల.

ఫజల్ సన్నగా, పొడుగ్గా యినప శలాకలా వుంటాడు అతడిలో బలంకంటే

చురుకుదనంపాలు హెచ్చు. తండ్రి ఎంత బలంగా దెబ్బ తీయగలడో, అంత చురుగ్గానూ ఆఘాతాన్ని తప్పించుకొనగలడు. మొదట అవతల వ్యక్తిని అలిసిపోయేటట్టు చేసి తరువాత సులువుగా ఓడించడం ఆతని పద్ధతి. ఆ సంగతి మంగల్‌ఖానుకు అంతగా అవగాహన కాలేదు. కనుక అతడు అలిసిపోయే పర్యంతం యావచ్ఛక్తి వినియోగించి బలమైన దెబ్బలే తీసాడు అవి తప్పించుకున్నాడే తప్ప అంతవరకూ ఎదురు దెబ్బ తీయలేదు ఫజల్. కాసేపటో మంగల్‌ఖాన్ శక్తి సన్నగిల్లింది. అతడు తిరిగి శక్తి సమకూర్చుకునేటంతలో ఫజల్ కరవాలం అద్భుతంగా వలయాకారంలో తిరిగి, మెరపు తీగెలా మెరసి మంగల్‌ఖాన్ కత్తిని ఎగరగొట్టి వేసింది.

ఫజల్ తన కత్తిని ఒరలో పెట్టేసి తల వంచుకొని నిలబడ్డాడు. కొద్ది క్షణాలపాటు అక్కడ గంభీరమైన నిశ్శబ్దం వ్యాపించింది. షేర్ ఏమనడానికి సాహసించడం లేదు.

చివరికి మంగల్‌ఖాన్ ఫజల్! ఈ నాటికి నన్ను ఓడించగల ప్రత్యర్థిని నిన్నొక్కడినే చూసాను. నాకు తగ్గ కొడుకువే. పులికడుపున పిల్లి పుట్టదు. కానీ ఏం లాభం? నీ ఆలోచనలు, చేతలు పెడదారి పట్టాయి. అవి సరైన దారిలోకి మళ్ళించుకొనే నాటివరకు నీకు స్వేచ్ఛగా మసిలే అదృష్టం కలగదు. తప్పనిసరి నిర్ణయం యిది.... షేర్! ఫజల్‌ను రాజఖైదీగా చూడండి. గౌరవానికీ, సౌకర్యాలకూ ఏ లోటూ రానివ్వద్దు. కానీ యితడిని బయటకు విడువకూడదు. విగ్రహాలూ వగైరా చెక్క నివ్వరాదు. నేను అనుమతించినవారు తప్ప యితరులు అతనితో సంభాషణలూ, వ్యవహారాలూ నడపకూడదు. ఈ కట్టుబాట్లన్నీ కట్టుదిట్టంగా యేర్పాటు చెయ్యి.... అగు. షేర్! నీవు వద్దు. నీకు ఫజల్‌పై చిన్నప్పటినుండి ఎత్తుకు పెంచిన మమకారం అధికం. ఆ మమకారం మత్తులో నీవు నా ఆజ్ఞలను నిర్లక్ష్యం చేయడానికి సంకోచించవు. నిన్ను తాత్కాలికంగా అశ్వదళాధిపతిగా మారుస్తున్నాను. ఆపదవిలోనున్న సులేమాన్‌ను యిక్కడకు పంపుతాను.... ఫజల్! నీవు మనసు మార్చుకున్ననాడే నేను నిన్ను చూడ్డానికి వస్తాను. నా నిబంధనలను అతిక్రమించడానికి సాహసించవద్దు ఫలితం యీమారు తీవ్రంగా వుంటుందని గమనించు. త్వరలో నీవు నా ఆశయాలకి అనుగుణంగా మారుతావని ఆశిస్తాను.... ఎవరక్కడ?" అన్నాడు.

ఇద్దరు భటులు వచ్చి నిలిచారు. వారిని ఫజల్‌పై కాపలాగా నియమించి, తగు విధంగా హెచ్చరించి, షేర్‌ను వెంటబెట్టుకొని వెడలిపోయాడు మంగల్‌ఖాన్.

మంగల్‌ఖాన్ జమీద్‌పూర్ జాగీరుకి సుబేదారు. ఢిల్లీ పాదుషాల క్రింద నమ్మకంగా పనిచేసి పేరూ, జాగీరూ సంపాదించుకున్నవాడు స్వయంశక్తి సామర్థ్యాలతో జాగీరుని విస్తరింపజేసుకున్నాడు జాగీరులోనూ, ఆ చుట్టు ప్రక్కల మంగల్‌ఖాన్ పేరంటే ప్రజలకు సింహస్వప్నం. మంగల్‌ఖాన్ ఒక్క యుద్ధసమయంలోను తప్పిస్తే స్వతః మంచివాడే. ఉదార మనస్కుడు. కానీ అతని మతి మతవిశ్వాలతో ఛాందసమై తప్పుదారి పట్టింది. మత సహనమనేది అతడిలోలేదు. పరమతాలంటే అతడికి ద్వేషంలేదు. కానీ అవి నిజమైన మతాలు కావనే చిన్న చూపుంది. ఆ అభిప్రాయంవల్లనె ముల్లాలద్వారా మహమ్మదీయ మతం గురించి ప్రచారం చేయించి, ప్రజలని తమ మతంలోనికి మార్చడానికి ప్రయత్నించేవాడు, అందు గురించి విరివిగా ధనం వెదజల్లేవాడే తప్ప అంతగా పట్టుపట్టలేదు. చెప్పినా మారకపోతే అది వారి ఖర్మ అని ఊరుకున్నాడు. ప్రచారం సాగుతూనే వుంది.

మంగల్‌ఖాన్ ఒకే ఒక కుమారుడు ఫజల్. తండ్రి ఎంతటి వీరుడో, రాజనీతి విశారదుడో ఫజల్ అంతటి విద్యావేత్త, కళాప్రియుడు, కళాప్రియుడైన అతని మనసు శిల్ప విద్యపైన లగ్నమైంది. హిందూ శిల్పం అతన్ని ఆకట్టింది. ఫజల్ మనసులో మతఛాందసత్వానికి స్థానంలేదు. కళ ఏ రూపంలోనైనా ఆరాధించవచ్చుననేది అతడి ప్రగాఢ విశ్వాసం దేవాలయాలపైన అపూర్వ శిల్ప కళా చమత్కృతి అతడిని చకితుడిగా చేసేది. స్వయంగా దేశమంతటా పర్యటించి శిల్పకళా నిలయములైన క్షేత్రాలనీ, ప్రదేశాలనీ సందర్శించాడు. ఆ శిల్ప కళాఖండాలు అతని హృదయంపైన చెరగని ముద్ర వేసాయి. అతడూ హిందూ సంస్కృతిని అర్థం చేసుకోవడానికి పురాణాలు, కావ్యాలు, శాస్త్రాలు ఉరుదూలోనికి అనువాదం చేయించుకొని చదివాడు, కాలక్రమాన అతడికి ఉత్తమ అభిప్రాయాలు అలవడ్డాయి. ఇక్కడే తండ్రికీ, అతడికీ చుక్కెదురైంది. మాయాచారి అనే సుప్రసిద్ధ శిల్పివద్ద ఫజల్ శిల్పకళ నేరుస్తున్నాడు. ఏకాగ్రంగా రెండుయేళ్ళు అభ్యసించి కృతకృత్యుడైనాడు. అతడి చేతిలో నల్లరాళ్లుకూడా వెన్నముద్దల్లా కరగసాగాయి. గురువు చేతనే సెబాసనిపించుకున్నాడు

ఇదంతా మంగల్‌ఖాన్ ఒక కంట కనిపెడుతూనే వున్నాడు. మొదట్లో ఫరవాలేదని ఉపేక్ష వహించాడు. కాని తోటి సర్దార్లలో తన కుమారునిగూర్చి లేనిపోని అపవాదులు చెలరేగడంతో అతడిక సహించలేకపోయాడు ఒక తోటి సుబేదారు" మీ అబ్బాయి ఫజల్ మాయాచారి కూతురు దుర్గని నిఖా చేసుకొంటాడట! నిజమేనా?" అని అడిగాడు. ఒకప్పుడు ఆ సుబేదారు తన కూతురిని ఫజల్‌కిచ్చి వివాహం చేస్తానని ఖాన్‌ను అడిగి నిరాశ చెందాడు. అతను నిరాకరించడంవల్ల ఇప్పుడు అవకాశం దొరగ్గానే ఎత్తిపొడుస్తున్నాడు. దీంతో మంగల్‌ఖాన్‌కు అరికాలి మంట నెత్తికెక్కింది. ఇక కొడుకును కట్టుదిట్టాల్లో పెట్టకపోతే లాభంలేదని అతడిని అదుపులో పెట్టాడు.

తండ్రి వెళ్ళిపోయిన తరువాత ఫజల్ ఆసనంలో చతికిలపడ్డాడు. కాస్సేపటిలో యిద్దరు భటులువచ్చి, విగ్రహం చెక్కువున్న పాలరాతిని పెకలించి తీసుకొనిపోతుండగా నిశ్శబ్దంగా చూసాడు. అతడు

ఏ ఆటంకం పెట్టినా నివారించడానికి సులేమాన్ వచ్చి చెంతనే నిలచాడు. ఫజల్ అతడివంక ఓరగా చూసి నవ్వు కున్నాడు. తనేమైనా చేయ దలచుకుంటే యిందాక తండ్రిచేతిలో కత్తి ఎగిరిపోయినపుడు చేసుండును. అప్పుడు తన అంతరంగికుడూ, ప్రబలమైన పలుకుబడీవున్న అహమ్మద్ షేర్ కూడా అందుబాట్లోనే వున్నాడు తనేది చెప్తే అది చేయడానికి. రాజవంశాల్లో తండ్రిని చంపీ, హత్యచేసీ, వారసుల్ని మట్టుబెట్టీ, బందీల్నిచేసీ సింహాసనం ఎక్కడం సర్వసాధారణమైన విషయం అంతవరకూ నిరంకుశాధికారం చెలాయించిన అధికారిని మరుక్షణంలో మరచిపోయి పరివారం, ప్రజలూ కొత్త పరిపాలకుని మన్నించడం మామూలే. ఇదేమీ అసాధారణం కాదు చరిత్రనిండా యిందుకు దృష్టాంతాలు కోకొల్లలుగా కనికిసాయి. మనుషులు మన్నించేది అధికారాన్ని గానీ, వ్యక్తిని కాదు.

ఫజల్ లోనికి వెళ్ళిపోయాడు. సులేమాన్ తలుపులు బయట తాళం వేసాడు. ఫజల్‌కు అవసరమైన సౌకర్యాలు సమకూర్చి. దిట్టమైన కావలి ఉంచాడు.

వారం రోజులు గడిచాయి. ఫజల్ మీద ఎన్ని ఆంక్షలు విధించినా, ఎన్ని ఒత్తిడులు పెట్టినా అతడు తన మనసు మార్చుకొనలేదు మంగల్‌ఖాన్ తన శక్తి కొలదీ ప్రయత్నించి, మౌల్వీలనూ, మహమ్మదీయ పండితులనూ పంపేవాడు వారి బోధనలు విని ఫజల్ నవ్వేవాడేతప్ప వ్యాఖ్యానించేవాడూ కాదు వంటబట్టించు కొనేవాడూ కాదు. ఆ ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరైనాయి. చివరికి మంగల్‌ఖాన్ విసిగిపోయి, ఆనాటి రాత్రి ఫజల్‌కు యిచ్చే భోజనంలో మత్తుమందు కలిపి పంపమని సులేమాన్‌కు ఆదేశించాడు. మత్తులోనున్న ఫజల్‌ను కాశ్మీర్‌లోని విలాస భవనానికి పంపి, అక్కడ భోగవిలాసాల్లోనూ, రాజకీయాల్లోనూ పడేసి, ఊపిరి పీల్చుకొనడానికి సందులేకుండాచేసి, అతడిని మార్చివేయాలని ఖాన్ సంకల్పం. స్వయంగా చెప్తే ఫజల్ సుతరామూ సమ్మతించడనీ, నానారభసా చేస్తాడనీ ఖాన్‌కి తెలుసు. అందుకని యీ ఎత్తు ఎత్తాడు.

ఫజల్‌కి పెంపుడుతండ్రి వంటి షేక్ చెవిన యీసంగతి యెలాగో చేరింది. అతని హృదయం నమకారంతో మండిపోయింది. ఫజల్‌ని తన సంతానంలా పదిహేనేళ్ళు పెంచి పెద్దచేసాడు. ఖాన్ చేసే యీ మోసంతో ఫజల్ ఏ అఘాయిత్యానికైనా ఒడిగడతాడేమోనని భయపడ్డాడు. ఎలాగైనా నాటిరాత్రి ఫజల్‌ను విడిపించి, కొంతకాలంపాటు అతడిని ఎక్కడికైనా అజ్ఞాత వాసంలోనికి పంపివేస్తే, కొద్దికాలానికి అన్ని విషయాలు చక్కబడతాయని నిశ్చయించాడు. అందుకు సన్నాహాలు ప్రారంభించాడు. కోటబయట రెండు ఉత్తమాశ్వాలను సర్వ సన్నద్ధంగా వుంచాడు. మంగల్‌ఖాన్ అధికార ముద్రని తెలివిగా చేజిక్కించుకున్నాడు అంతా సిద్ధంగావుంది. సాయం సమయమైంది. మంగల్‌ఖాన్ ఫజల్‌ను పంపేవిషయమై సులేమాన్‌తో రహస్యమందిరలో చర్చిస్తున్నాడు ఇదే తగిన సమయమని షేక్ ఫజల్ మందిరానికి వెళ్లాము.

"ఫజల్‌ను నాతో పంపమని ప్రభువుల ఉత్తరువు" అని అక్కడి కావలావారికి చెప్పి. అధికార ముద్రను చూపాడు. సైనికులు సలాములుచేసి. తలుపులు తెరిచారు షేక్ లోనకువెళ్ళి పన్నాగమంతా ఫజల్‌కు చెప్పాడు. ఫజల్ మొదట తటపటాయించినా పరిస్థితులు చక్కబడేవర్యంతం ఎక్కడికైనా పోవడానికి సమ్మతించాడు. ఇద్దరూ త్వరితంగా నిష్క్రమించారు. షేక్ ఫజల్‌ను అనుసరించడానికే నిశ్చయించుకున్నాడు. సాధ్యమైనంతగా తమ ముఖాలను బురఖాలతో కప్పుకొని కోట బయటకు సాగారు.

ఇంతలో చర్చ ముగించి సులేమాన్ ఫజల్ మందిరానికి వచ్చాడు. అక్కడి కావలావారు ఫజల్‌ను షేర్ మంగల్‌ఖాన్ అధికార ముద్రచూపి విడిపించుకు వెళ్లాడని చెప్పగానే దిమ్మెరపోయాడు వెంటనే తేరుకొని మంగల్‌ఖాన్ దగ్గరకు పరుగెత్తాడు.

"హుజూర్! మీరు ఫజల్‌ను విడిపించమని షేక్‌ను పంపారా?"

"ఏమిటీ!?"

"తమ అధికారముద్రచూపి షేర్ ఫజల్‌ను విడిపించుకుపోయాడట!"

మంగల్‌ఖాన్ అధికార ముద్రకోసం వెదకి, అది లేదని గ్రహించి "ఎంత మోసం! సులేమాన్! వారీ చుట్టు ప్రక్కలే ఉండి వుంటారు. వెంటనే పట్టుకోనేయ్. సైన్యాన్ని పంపి నలుమూలలా వెదికించు పట్టినవారిగ్గానీ, జాడ చెప్పిన వారిగ్గానీ బహుమతి యివ్వబడుతుందని చాటింపు వేయించు, పో" అని అరిచాడు. సులేమాన్ పరిగెత్తాడు. రెండుక్షణాల్లో అశ్వకదళం, పదాతిదళం కోట నలుదిక్కులా కమ్ముకొన్నాయి మంగల్‌ఖాన్ కోట పైబురుజు యెక్కి నలుదిక్కులా పరీక్షగా కలయజూసాడు. కోట బయట గుర్రాలను హడావుడిగా అధిరోహిస్తున్న యిద్దరు ముసుగుమనుషులు అతని కంటబడ్డారు. అందులో ఒక వ్యక్తిని ఒడ్డు, పొడుగులని బట్టి షేక్ అని గ్రహించాడు ఖాన్. కనుక రెండవ వ్యక్తి ఫజలై వుండాలని నిశ్చయించుకొని, అందుబాట్లోవున్న తుపాకీ తీసుకొని గురిపెట్టి కాల్చాడు ఆ దెబ్బకి యిద్దరు ముసుగు మనుషుల్లో ఒకరు రాలిపోయారు. ఇంతలో అశ్వకదళం రెండవ వ్యక్తిని చుట్టుముట్టి అటకాయించింది. షేర్ కావవారితో కొట్లాడుతున్నాడు. ఖాన్ బురుజుదిగి వచ్చాడు రెండవవ్యక్తి ముసుగు తొలిగించాడు.

ఆశ్చర్యం! ఖాన్ అనుకున్నట్లు ఆ ముసుగువ్యక్తి ఫజల్ కాదు. షేర్ భార్య ఆమె వణకుతూ నిలబడింది, ఖాన్ ఛీత్కారం చేసాడు. 'షేర్‌ను కాలితో తన్ని "ఫజల్ ఎక్కడ?" అని అడిగాడు. షేర్ సంతృప్తి నయనాలతో ఆకాశంవంక చూస్తూ "అల్లా కృపవల్ల యీ పాటికి

(తరువాయి 25వ పేజీలో)

# పాడుపడిన గుడి

(8వ పేజీ తరువాయి)

ఎక్కడికో క్షేమంగా చేరుకొనే వుంటాడు." అతడి కళ్ళు శాశ్వతంగా మూతపడ్డాయి. మంగల్‌ఖాన్ ఎంత తరచి అడిగినా షేర్ భార్య ఏమీ చెప్పలేదు. ఆమెను కారాగారంలో వుంచమని ఆజ్ఞాపించి, షేర్ కళేబరాన్ని పాతిపెట్టించి, తన మందిరానికి తిరిగి వచ్చాడు. సులేమాన్‌ను అశ్విక దళాన్ని తీసుకొని ఫజల్ జాడలు వెంటనే తీయమని ఆజ్ఞాపించాడు. సులేమాన్ ఫజల్‌కోసం అన్వేషణ ప్రారంభించాడు.

ప్రజల్లో పలురకాల కట్టుకథలు, ప్రవాదాలు యిందుగురించి వ్యాపించాయి. అయితే మంగల్‌ఖాన్‌అంటే ఉన్న భయం వలన యీ చర్చలు బహిరంగంగా సాగలేదు. సులేమాన్ రెండు నెలలు విర్విరామంగా అన్వేషించినా ఫజల్ జాడ లభించలేదు." చివరికి ఖాన్ నిరాశ చేసుకొని ఈ "అన్వేషణ చాలు. ఏ నాటికైనా బుద్ధి పుడితే అతడే తిరిగి వస్తాడు." అని సులేమాన్‌ను అన్వేషణనుండి విరమింపజేసాడు. ఫజల్ ఏమైనాడో ఎవరికీ అంతు తెలియలేదు.

మంగల్‌ఖాన్ జాగీరును ఆనుకొనే ప్రతాపచంద్రపుర్ సంస్థానం వుంది. దాన్ని పరిపాలిస్తున్న ఆనందపాలునికి, మంగల్‌ఖాన్‌కి సరిహద్దు గురించి చిరకాలంగా స్పర్థలున్నాయి. అడపా దడపా పోరాటాలు జరిగేవి. ఎవరికీ విజయం చిక్కలేదు. కొద్దికాలం క్రితం యిద్దరూ సరిహద్దులో నున్న నదీప్రాంతాన్ని ఎవరూ ఆక్రమించుకొనకుండా వుండడానికి ఒప్పందం చేసుకున్నారు. అందువలన కొంత కాలంగా శాంతి నెలకొంది.

ఆనందపాలుడు కళాపిపాసి. అందులో శిల్పకళంటే ప్రాణం. తన సంస్థానంలో రెండు చక్కని దేవాలయాన్ని కట్టించాడు. తన కీర్తిప్రతిష్టలు శాశ్వతంగా వుండేటట్లు ఒక మహోన్నత దేవాలయం అత్యుత్తమ శిల్పంతో నిర్మింపజేయాలనేది అతడి చిరకాల వాంఛ. ఆ దేవాలయ నిర్మాణానికి నాయకత్వం వహించగల ఉత్తమ శిల్పికోసం అతడు గాలిస్తున్నాడు. ఎరికలో నున్న ఎందరో శిల్పులను పిలిపించి పరీక్షించినా అతడికినచ్చినవారు లేకపోయారు. నలువంకలా వార్తాహరులనుపంపి వెదకింపజేస్తున్నాడు

ఆనందపాలుని కుమార్తె చంద్రికళ. పేరుకుతగ్గట్టే సౌంర్యదేవతలా వుంటుంది. సంగీతంలో నిధి పాడుతే రాళ్ళు కరుగుతాయి ఆమెను చేబట్టడానికి ఎందరో రాకుమారులూ, ప్రభువులూ పోటీలు పడుతున్నారు. కానీ ఆమె హృదయం యింత వరకూ ఎవరిపైనాలగ్నంకాలేదు. తండ్రితో బాటు రాజకీయాల్లో పాల్గొంటుంది వ్యవహారాలు చక్కబెడుతూంది. తండ్రిలాగానే ఆమె కూడా శిల్పకళంటే ఎక్కువ మక్కువ చూపుతుంది. కళాపోషణలో తండ్రీ కూతుళ్లది ఒకమాట.

ఆనందపాలుడు పంపిన వార్తాహరులలో ఒకడు మారుమూలను గ్రామంలోనున్న ఒక అజ్ఞాతశిల్పిగూర్చి వార్త తెచ్చాడు. అతడి శిల్పకళా చమత్కృతిని తెగ పొగిడాడు చంద్రికళ పురుషవేషంలో ఆశిల్పిని గురించి స్వయంగా పరిశీలించి రావడానికి తరలింది. ఆ అజ్ఞాతశిల్పి పేరు నాగవర్మ. అతని జీవితం అమిత నిరాడంబరం. వాక్కు ఎంత మృదువో, ఉలిదెబ్బ అంత పదును. అతడు చెక్కిన అపూర్వ శిల్పాలనుచూచి చంద్రికళ దిగ్భ్రాంతి చెందింది ఇంతటి ఉత్తమ శిల్పకారుడు ఆగ్రామంలో అనామకుడిగా పేరూ ప్రతిష్టా ఆశించకుండా పడున్నందుకు ఆమె ఆశ్చర్యపడింది. ఆమె నాగవర్మను కలుసుకొని తనతండ్రి ఆశయాన్ని వివరించింది.

"శిల్పవర్యా! తాము తప్పకుండా మా రాజధానికివిచ్చేసి, మా సత్కారాన్ని అందుకొని, మా ఆశయాన్ని నెరవేర్చ గోరుతున్నాను. అందుకు తాము సమర్థులని నాకు విశ్వాసం కలిగింది. మా తండ్రిగారికి తమవంటి అపూర్వ శిల్పులను ఆదరించడమంటే అమితానందం. వారు ఒక మహోన్నత సుందర దేవాలయాన్ని కట్టించాలని ఎంతోకాలంగా ఆశిస్తున్నారు. అయితే దాని నిర్మాణానికి పూనుకొనగల తగిన ఉత్తమశిల్పి లభ్యంకానందున అది ఆలోచనగానే వుండిపోయింది. ఈనాటికి మీశిల్పకళా పనితనాన్ని చూస్తుంటే మీరు మాతండ్రిగారి కళల్ని నిజంచేయగలరని తోస్తోంది. దయచేసి నా వెంట రాగోరుతాను"

నాగవర్మ మొదట్లో అంగీకరించలేదు. కానీ చంద్రికళ మరీమరీ నచ్చజెప్పి తమ రాజధాని చంద్రనగరానికి అతను చెక్కిన శిల్పాలతోసహా వెంటబెట్టుకుపోయింది.

ఆనందపాలుడు నాగవర్మ శిల్పకళా ప్రతిభను చూసి విస్మయం చెందాడు తన ఆశయం సఫలంకాగలదని ఆశిస్తూ అతన్ని దేవాలయ నిర్మాణానికి ప్రధాన శిల్పిగా నియమించాడు. నాగవర్మ సుఖంగా నివసించడానికి ఒక సుందరసౌధం, సకల సౌకర్యాలూ చేకూర్చాడు. దేనికీ లోటనేది లేకుండా, కావలిసినది అడిగిన వెంటనే అందిచ్చే యేర్పాట్లు చేసాడు.

దేవాలయ నిర్మాణానికి తగిన ప్రదేశం గూర్చి నాగవర్మ చుట్టుప్రక్కల అన్వేషించాడు. సరిహద్దులోనున్న చంద్రానదీ తీరం అతనిని ఆకర్షించింది. చక్కని నదీ తీరం, చుట్టూ అందమైన పచ్చటి అడవి. ప్రశాంత వాతావరణంగల ఆ ప్రదేశంలో ఒక భాగాన్ని ఎన్నిక చేసుకొని ఆనందపాలునికి చెప్పాడు. ఆనందపాలుడు కొద్ది రోజులు బాగా ఆలోచించిన తరువాత, దేవాలయ నిర్మాణానికి మంగల్‌ఖాన్ అడ్డు చెప్పడనీ, అది ఆక్రమణ కాదనీ నిశ్చయించుకొని నిర్మాణానికి అనుజ్ఞ యిచ్చాడు. దేవాలయ నిర్మాణం ప్రారంభమైంది. ఆనందపాలుని కులదేవత చండికకు తగిన రీతిలో దేవాలయ నిర్మాణ ప్రణాళికను రచించి, పని ప్రారంభించాడు నాగవర్మ.

మహోన్నత చండికా దేవాలయానికి చంద్రా నదీ తీరాన శాస్త్రోక్తంగా పునా

దులు పడ్డాయి. దేవాలయ నిర్మాణం చురుగ్గా సాగుతోంది నాగవర్మ తనకు సహాయంగా కొందరు మహాశిల్పులను, వాస్తు శాస్త్రజ్ఞులను నియమించుకున్నాడు. అయిదువందలమంది కూలీలు రాత్రిం బగళ్ళు జట్లువారీగా పనిచేయ సాగారు.

నాగవర్మ దేవాలయ కట్టడానికి నున్నని ఎర్రి యిసుకరాయిని వాడుతున్నాడు. పట్టుకువచ్చిన ప్రతి రాతినీ పరీక్షించి, అది తన పరీక్షకు నిలిస్తేనే నిర్మాణంలో వినియోగించేవాడు ఏమాత్రిం లోపం కనపడినా దాన్ని పారవేయించసాగాడు. చిన్న పుష్పం నుంచి పెద్ద దైవ విగ్రహాల చెక్కడంవరకూ ప్రతి విషయంలోనూ శ్రద్ధతీసుకొని జాగ్రత్తగా గమనిస్తూ, తోటి శిల్పులకు తగిన సూచనలిస్తూ సూర్యోదయం మొదలు అర్ధరాత్రివరకూ పని చేసేవాడు.

దేవాలయ నిర్మాణంలో స్వచ్ఛమైన భారతీయ వాస్తు పద్ధతినీ, విగ్రహాల చెక్కడపు పనిలో గాంధార శిల్పపద్ధతినీ అవలంబించాడు నాగవర్మ. రెండింటినీ చక్కగా కలయబోసి, ప్రతిశిల్పాన్ని ఒక ఉత్తమ కళాఖండంగా తీర్చిదిద్దుతున్నాడు. ఆనందపాలుడు రోజూ వచ్చి నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ తనాశించిన దానికంటే అత్యుత్తమంగా వెలుస్తున్న ఆ దేవాలయాన్ని చూసి మురిసిపోయేవాడు ఆయనకు నాగవర్మపై అంతులేని అభిమానం యేర్పడింది. ఇంత సృష్టించగల ప్రజ్ఞావంతుడైన శిల్పి అజ్ఞాతవాసుడై ఉండడానికి కారణమేమిటని ప్రశ్నించాడు. నాగవర్మ తేలికగా నవ్వేశాడు.

"ప్రభూ! నేను కళా పిపాసినేగానీ, ప్రతిష్ఠ, ప్రచారం కోరేవాడినికాదు" అన్నాడు.

"మీవంటి ఉత్తమ శిల్పులకు యింతటి వినయం, నిగర్వం మరింతగా మెరుగు పెడుతున్నాయి. కళను, కళాకారులను కనుగొని, గౌరవించడం మా విధి, అది మీరు గొప్పని ఆరోపించడంకాదు. కేవలం మీలోని సృజనాశక్తిని అభినందించడం అదృష్టవశాత్తూ మీరు లభించారు. లేకుంటే నా వాంఛ యీ జన్మలో యీడేరేదికాదు."

"ప్రభూ! మీరు మిక్కిలిగా పొగడుతున్నారు. ఇంతకు పూర్వమే ఎన్నో మహోన్నత శిల్పాలు వెలిశాయి. వాటి ముందు నావి ఒక అణుమాత్రిమే. ఏలవలేశ శక్తో నాకు అబ్బింది. ప్రధాన శిల్పినిచేసి పనికి పురిగొల్పారు. బాధ్యత స్వీకరించిన తరువాత చేతనైనంతగా చేయడం నా విధి. అషామాషీగా చేసి చేతులు దులుపుకొనడం నాకూ, మీకూ కూడా అపకీర్తి తెస్తుంది" ఆనందపాలుడు నాగవర్మ భుజంతట్టి నిష్క్రమించాడు.

ఆనాటి మధ్యాహ్నం తండ్రి తెగపొగడిన దేవాలయ నిర్మాణాన్ని చూడ్డానికి స్వయంగా వచ్చింది. మండుటెండలో నాగవర్మ ఒక శిల్పాన్ని తదేక నిష్ఠతో చెక్కుతున్నాడు. చంద్రికళ ఎక్కివచ్చిన అశ్వాన్ని విడచి, నాగవర్మ వెనుకగా నిలబడి చూడసాగింది. నాగవర్మ మహిషాసుర మర్దని శిల్పాన్ని మలుస్తున్నాడు. నాగవర్మ పనితనంలో తీవ్రిరసం ఉట్టిపడుతోంది. అతడి నుదుటిపై శ్రమ సూచకంగా స్వేదబిందువులు మెరుస్తున్నాయి. నల్లటి పొట్టి గడ్డం, సన్నగా మెలితిరిగిన మీసం అతని వదనానికొక వింతుతనాన్ని తెచ్చాయి. ధనుస్సులా వంపులు తిరిగిన పెదవులపై గాంభీర్యం ఘనీభవించింది. శిలమీద పడుతున్న ఉలిదెబ్బలు లయబద్ధంగా వినవస్తున్నాయి. చంద్రికళ రాకను అతడు గమనించలేదు. శిల్పానికి చివరి మెరుగులు దిద్ది చెమట తుడుచుకుంటూ నాగవర్మ వెనుదిరిగి, శిల్పంకేసి విస్మయదృష్టితో వీక్షిస్తున్న చంద్రికళను చూసి అతడు చకితుడయ్యాడు. చంద్రికళ అపూర్వ సౌందర్యం అతన్ని ఆకట్టివేసింది. అంతలో చంద్రికళ అతని వంక చూసింది. రెండు, మూడు క్షణాలపాటు వారలాగనే నిలబడ్డారు. వారి హృదయాల్లో ఏదో వసంతం వెలిసింది.

"నేను ఆనందపాలుర కుమార్తెను. నన్ను చంద్రికళ అంటారు. ఆనాడు మిమ్మల్ని పురుషవేషంలో వెంటబెట్టుకు వచ్చినది నేనే. మీరింకా గుర్తించలేదనుకుంటాను. తిరిగి మిమ్మల్ని చూడ్డానికి యిప్పటిదాకా వీలులేక రాలేకపోయాను." అంది చంద్రికళ.

"ఓ! మీరా రాకుమారీ! మీగురించి యిక్కడివారలందరూ అద్భుతంగా చెప్పుకుంటూ వుంటారు మిమ్మల్ని తిరిగి కలుసుకొన్నందుకు సంతోషం. నాకింత కీర్తి చేకూర్చిపెట్టినందుకూ, ఆశ్రియం కల్పించినందుకూ మీకు కృతజ్ఞుడిని."

"ఆర్యా! మీ కళకు విలువెక్కడ? మీరు రావడమే అదృష్టం. నన్ను మీరు గౌరవించనక్కరలేదు పేరుతో పిలువవచ్చును.

"ఆహా!" నాగవర్మ తలపంకించాడు. అతడిలో రాజఠీవి ఉట్టిపడింద

"మీరు సామాన్యు లని పించడంలేదు. లక్షణాలు చూస్తే."

"కావచ్చు, కానీ నేను ఒక శిల్పిని! అది చాలు"

"మీరు కత్తిపట్టడానికి విముఖులా?.... క్షమించాలి, ఎందుకో మీలో వీరలక్షణాలు కూడా స్పష్టంగా మిళితమై కన్పిస్తూండడం వలన అడుగుతున్నాను"

"కాదు. న్యాయం కోసం, ఆత్మరక్షణ నిమిత్తం కత్తి పట్టితీరాలి. కానీ వ్యర్థ రక్తపాతానికి, స్వార్థ సంపాదనకీ నేను కత్తి పట్టడం అంగీకరించను"

"చాలా చక్కగా వ్యాఖ్యానించారు. తాము శిల్పకళావేత్తలేకాక, నీతి శాస్త్రంలో కూడా దిట్టలే!"

చంద్రకళ మనసు నాగవర్మపై లగ్నమైపోయింది. ఎన్నో రాచ సంబంధాలను నిరాకరించిన తాను ఒక సామాన్య, అజ్ఞాత శిల్పివివరించినందుకు తానే ఆశ్చర్యపడింది. నాగవర్మకూడా ప్రథమ వీక్షణంలోనే అతని హృదయంలో చంద్రకళ శిల్పాన్ని శాశ్వతంగా మలుచుకున్నాడు. చంద్రికళను దేవాలయమంతా తిప్పి వివరించిచెప్పాడు నిర్మాణం గురించి. ఆశిల్ప

కళా చమత్కృతి చూచి దేశమంతటా దాని ఖ్యాతి మారు మ్రోగగలదని తన అభిప్రాయం తెలిపింది చంద్రికళ.

రోజులు చకచక గడుస్తున్నాయి. దేవాలయ నిర్మాణం దాదాపు ముగిసింది. చివరి మెరుగులు దిద్దబడుతున్నాయి. నాగవర్మ దేవాలయంలో ప్రతిష్ఠించవలసిన విగ్రహాన్ని చెక్కడానికి చక్కటి పది అడుగుల చలువరాతి ఫలకాన్ని తెప్పించాడు. అతనిలో ఆ విగ్రహాన్ని మలచవలసిన తీరింకా నిశ్చయం కాలేదు. ఎలా రూపు కల్పిస్తే బాగుంటుందా అని ఆలోచిస్తున్నాడు చంద్రికళ యీ విషయం గమనించింది.

"ఆర్యా! విగ్రహం చెక్కడానికి ఎందుకో సందేహిస్తున్నారు?"

"అవును. మున్నెన్నడూలేని ప్రత్యేక పద్ధతి యిందులో కల్పించాలని ఆలోచిస్తున్నాను. అందుకు తగిన భావావేశం పొందలేక పోతున్నాను."

"తాము సంగీతాస్వాదనలో భావావేశం పొందగలరా?"

"ఏమో....?"

"ప్రయత్నించండి. నేనొక అష్టపది పాడుతాను."

చంద్రికళ అష్టపది అందుకొంది. చక్కటి మలయమారుత రాగంలో ఉరకలు వేయిసూ ఆలాపనా చేసూ నాగవర్మను ఆనందలహరిలో ముంచింది. అప్రయత్నంగా నాగవర్మ చేతిలో ఉలి చలువ రాతిపై లాస్యం చేయసాగింది. అష్టపది ముగిసేటప్పటికి నాగవర్మ మూడో వంతు పని ముగించాడు. చంద్రికళ శిల్పంవంక చూసింది. ఎదురుగా దుర్గాదేవి దర్శనమిచ్చింది. నాగవర్మ చేసంజ్ఞతో కుడి ప్రక్కనుండి సూచించాడు. అటు సరస్వతీదేవి వెలిసింది. ఎడమవంక నుండి చూడగా శ్రీదేవి చిరునవ్వుల సిరులు వలకబోసూంది.

"ఇదంతా నీ రాగ ప్రభావమే చంద్రికళా దేవీ! మరో రెండు రోజులు శ్రమ అనుకొనక తోడ్పడ్డావంటే యీ శిల్పం నీ పేరుకి "మారు రూపుగా నిలుసుంది.

"నా పేరు కాదు ఆర్యా! తమది."

చంద్రికళ కోటకు మరలిపోయింది. అక్కడ ఆనందపాలుడు ఆవేశంతో సేనా నాయకులకు ఆదేశాలిస్తున్నాడు.

నాన్నగారూ! ఏమిటి సంగతి?" అడిగింది చంద్రికళ.

"మంగల్‌ఖాన్ దండెత్తి వస్తున్నాడు. దేవాలయాన్ని నదీతీరంలో నిర్మించడానికి వలను పడదట. ఆ ప్రాంతం తనకు చెందాలిట. దేవాలయాన్ని కట్టినంత వరకూ వెంటనే తొలగించ వేయమనీ, లేకుంటే తానే స్వయంగా దాన్ని నేలమట్టంచేసి, ఆ ప్రాంతాన్ని ఆక్రమించగలననీ వార్త పంపాడు. మూర్ఖుడు! ఎన్నిగుండెలు వాడికి నా కంఠంలో ప్రాణమున్నంతవరకూ ఎదిరించి తీరుతాను."

"మంగల్‌ఖాన్ ఏ మాత్రం దూరంలో వున్నాడు?"

"బహుశా సరిహద్దుకి రేపటి సాయంకాలానికి చేరుతాడు."

"ఈసారి గట్టివాతే పెట్టాలి. రాజపుత్రిలకత్తిపస, పగపదును రుచిచూపాలి"

"సెబాస్! చంద్రికళా! నాకు కుమారులు లేని లోటులేదు."

"అవసరమైతే స్త్రీలు దుర్గాదేవులుగా మారుతారు."

ఆనాటి సాయంత్రం మంగల్‌ఖాన్ సైన్యంగా చంద్రా నదీ ఎగువ తీరాన మోహరించాడు. ఆనందపాలుని సైన్యాలు యీవలి ఒడ్డున నిలిచాయి. మరునాటి ఉదయం ఖాన్ సైన్యాలు నది దాటాయి. ఆనందపాలుని సైన్యం పోరుతూ కొంత వెనక్కి తగ్గింది. ఖాన్ ప్రచండంగా శత్రు సేనను చీల్చి చెండాడుతూ ముందుకు సాగాడు. అతన్ని ఆనందపాలుడు ఎదుర్కొన్నాడు. ఇరుపురికీ ఘోరమైనపోరు జరిగింది. ఖాన్ చేతిలో ఆనందపాలుడు నమసి పోయాడు. ఆనందపాలుని మరణంతో హిందూ శేష సైన్యం చెదరిపోసాగింది. చంద్రకళ కవచధారియై వచ్చి సైన్యాన్ని హెచ్చరించి, పోరుసాగించింది. దేవాలయ గోపురంపై చెక్కడపుపని సాగిస్తున్న నాగవర్మ నిశ్చేష్టుడై చూస్తున్నాడు. చంద్రకళ శక్తికొలదీ పోరి, బందీగా చిక్కిపోయింది మిగిలిన చంద్రిపుర సైన్యంకూడా నిరాయుధులు చేయబడ్డారు. మంగల్‌ఖాన్ మీసం దువ్వుతూ చంద్రికళవంక ఆశ్చర్యంగా చూసాడు.

"బేటీ!...." అని ఆగాడు. అతని చేతి సంజ్ఞతో రెండు ఫిరంగులు ముందుకు తే

(తరువాయి 28వ పేజీలో)

చదవండి! చదవండి!!

★ సాధన ★

(మాస పత్రిక)

ప్రచురణ: భారతీయ రచయితల సమితి ఆంధ్ర ప్రదేశ్

సంపాదకుడు: మన్నవ గిరిధరరావు ఎం. ఏ.,

విడి ప్రతి 0-25 న పై. సాలు చందా రు 3-00

అరండేల్‌పేట : : గుంటూరు - 2.

మాదిరి కాపీకై నేడే వ్రాయండి!

## పాడుపడిన గుడి

(27 వ పేజీ తరువాయి)

బడ్డాయి. ఒకటి దేవాలయానికి, మరొకటి చంద్రికళకు ఎదురుగా నిలిపారు.

"చూసావు కదా! ఎదురుగా ఏముందో? నీ తండ్రి నా చేతిలో మరణించాడు. నా విరోధం అంతమైనట్లే. కానీ నేను రెండు షరతులమీద నిన్నూ, నీ సంస్థానాన్ని విడచి పుచ్చుతాను. ఒకటి.... దేవాలయాన్ని తొలగించివేసి, యీ ప్రాంతాన్ని నా స్వాధీనం చేయాలి రెండు.... నాకు ప్రతీ సంవత్సరం రెండు లక్షల వరహాలు కప్పంగా కట్టాలి. దీనికి సమ్మతించితే సరే! లేకుంటే ఆ ఫిరంగులు నిన్నూ ఆ దేవాలయాన్నికూడా నేలపాలు చేస్తాయి. కేవలం దయతో అవకాశం యిస్తున్నాను. కావాలంటే నీయిష్టంతో పనిలేకుండానే ఆ పని చేయగలను. ఆలోచించుకో"

"హు! నన్ను భయపిస్తారా ఖాన్! నేను రాజపుత్రికను. మరణంకి వెరవను. ఆ అపూర్వ దేవాలయాన్ని నేలమట్టం చేసి మూటగట్టుకొనే పాపానికి భయపడుతాను. తమదయ నా కనవసరం."

ఖాన్ తటపటాయించ సాగాడు. "ఊ...." అని అనుజ్ఞ యివ్వబోయాడు కటువుగా.

ఇంతలో దేవాలయ గోపురం నుండి "అబ్బా జాన్!" అనే అరుపు ప్రతిధ్వనించింది. చిరకాలంగా వినబడని ఆ పిలుపు విని ఖాన్ రివ్వపడి పైకి చూసాడు. నాగవర్మ గడ్డాన్ని, మీసాల్ని, తలపాగాను తొలగించాడు. నాగవర్మ స్థానంలో అదృశ్యమైన ఫజల్ ప్రత్యక్షమైనాడు!

"ఫజల్!?" అని కలవరించినట్లు పలికాడు ఖాన్. "నీవా?"

"అవును. నేనే. అబ్బాజాన్! భోగాల్లో బానిసను కావడానికి యిష్టంలేక యిలా ఒక సామాన్య శిల్పినై సంతోషంగా సంతృప్తితో జీవిస్తున్నాను. నేను కోరే దొకటే! తాము దయచేసి ప్రశాంతంగా వెళ్ళిపోండి."

"వీల్లేదు"

"అంతేనా?"

"అంతే"

"అయితే ఆ దారుణంకంటే ముందుగా నా మరణం చూడండి." అంటూ ఎనబది అడుగుల ఎత్తునుండి క్రిందకు దుమికాడు నాగవర్మ. కాదు ఫజల్! ఖాన్ 'ఫజల్!' అంటూ వెర్రిగా పరుగెత్తాడు. సైన్యమంతా, అక్కడివారంతా శిల్పాల్లాగే నిర్జీవంగా నిలిచారు. ఫజల్ శరీరం ఎర్రని యిసుక రాళ్ళమీదపడి, తన రక్త ధారలతో వాటిని మరింత ఎరుపుగా మార్చింది చంద్రికళ చేతులకు వేసిన సంకెళ్లు గలగలలాడుతుండగా ఫజల్‌వంక పరుగెత్తింది. ఆమె వంక ఒక్కమారు ప్రేమగా చూసి "చంద్రా!" అని కళ్లు మూసాడు. ఖాన్‌లో కన్నీళ్ళ ధారలు కట్టాయి చంద్రికళకు వేసిన సంకెళ్లు తొలగించివేసాడు. చంద్రికళ దెబ్బతిన్న తాచులా బుసకొట్టింది.

"తమ కుమారుడినే బలిగొన్న తరువాత మీ రక్తదాహం చల్లారిందనుకొంటాను. చాలకపోతే నన్ను కూడా లెక్కకట్టుకొనండి." అంటూ ఖాన్ వారించేలోపునే బాకు దూసి పొడుచుకుంది. ఆమె శరీరం ఫజల్‌పైన ఒరగిపోయింది.

ఖాన్ దుఃఖంతో కుములుతూ వారిద్దరినీ సమాధి చేయించి, తన జాగీరుకి తిరిగి వెళ్ళాడు. కొద్దికాలంలోనే మనోవ్యాధి గ్రస్తుడై మరణించాడు.

ఆ తరువాత మరెప్పుడూ ఆ ప్రారంభించిన గుడి పూర్తిచేయబడలేదు. అది పూర్తిగా పాడుబడింది. మూడవ వంతు చెక్కిన దేవీవిగ్రహం బయట అలాగేపడి ఎండవానలకు లోబడిపోయింది.

అప్పుడప్పుడు ఆ పాడుపడిన గుడిలో అర్ధరాత్రివేళ ఎవరో స్త్రీ పాడుతున్నట్లు, ఎవరో రాతిని చెక్కుతున్నట్లు శబ్దాలు వినిపిస్తాయని చుట్టు ప్రక్కల ప్రజలు రకరకాల కథలు చెప్పుకుంటారు. విషాదాంత కథకి సూచకంగా ఆ పాడుపడిన గుడి విషాదస్మృతులనే విరజిమ్ముతూ వుంటుంది.

:O:

---


## ప్రకటన

బందరుసబుకోర్టులో

O. S. 3/62 E. P. 85/62

మేకా వెంకటరత్నం - డిక్రీహోల్డరు

and

గంగవరపు వెంకట సుబ్బయ్య వగైరా - జడ్జిమెంటుడెటర్లు

యీ నెంబరులో యీ దిగువ కనపర్చిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థివి 15-7-63 తేదీన పగలు 11 గంటలు లగాయతు పైకోర్టువారి వలన వేలం వేయబడును.

షెడ్యూలు: కృష్ణా డిస్ట్రిక్టు చల్లపల్లి సబురిజిష్ట్రారువారి యిలాకా మంగళాపురం గ్రామంలో వున్నటువంటిన్ని యీ నెంబరు J. D. Rs. కు సంపూర్ణ హక్కు భుక్తములు కలిగినటువంటిన్ని వేలం కావలసిన ఆస్తి వయినం.

| | సర్వే నెం. | ఏరియా | పల్లం | D. H. R. కిమ్మతు | కోర్టువారి కిమ్మతు |
|---|---|---|---|---|---|
| 1) | 146 | 4-99 | పల్లం | రు. 10000/- | రు. 23000/- |
| 2) | 145 | 2-89 | డిటో | 5000/- | రు. 13000/- |

రిమార్కులు 1) యి సి. దాఖలా 1 వ రిమార్కు జడ్జిమెంటుడెటర్లు వ్రాసుకున్న 15-4-56 తేదిగల పార్టిషన్ రోడ్డు ప్రతివాదులు హక్కు తెల్పును

2) 1-10-60 తేది దఖలు దస్తావేజువల్ల ప్రతివాదులు హక్కు తెలుపు దస్తావేజు అయియున్నది లోబడపసరంలేదు. శిస్తు యు 1 కి 30/-

M. Seshagiri Rao
D. H. R. (వాది) తరపు అడ్వకేటు